**జరిగిన కథ :** కాశీమజిలీ కథలను మధిర సుబ్బన్న దీక్షితకవి 1930వ దశకంలో 12 భాగాలుగా రచించారు. అందులో అనేక ఉపకథలతో 8వ సంపుటి మొత్తం ఆక్రమించిన 'సప్తమిత్ర చరిత్ర' ఆసక్తిదాయకమైనది. భోజరాజు కథతో ముడిపెట్టి.. ఏడుగురు మిత్రుల కథ అనేక వింతలతో కూడుకుని ఉంటుంది.






# స్త్రీగా మారిన పురుషుడు

అనుసృజన: **నేతి సూర్యనారాయణ శర్మ**

**కాశీ** నుంచి ఒక బ్రాహ్మణ కుమారుడు ధారానగరానికి వెళ్తూ.. మహారణ్యంలో చిక్కుకుపోయాడు. వెంట తెచ్చుకున్న ఆహార పదార్థాలు అయిపోయాయి. అడవిలో దొరికే పళ్లు, దుంపలు తింటూ.. రాత్రిపూట చెట్లపై పడుకుంటూ.. ఇరవై రోజులపాటు ప్రయాణం చేసినా, ఒక్క పల్లె కూడా కనిపించలేదు. తోటి మనిషి జాడ లేదు.

'ఈ దారి ఎటుపోతుందో తెలియదు. చివరికి ధారానగరం చేరగలనో.. ఏ క్రూరమృగానికో ఆహారం అవుతానో తెలియదు కదా!' అని మనసులో తలపోశాడు.

ఆ రాత్రి తల దాచుకునేందుకు చోటుకోసం వెతుకుతుండగా.. అల్లంత దూరాన ఏదో వెలుగు కనిపించింది. మరికొంచెం ముందుకు వెళ్లేసరికి అక్కడో భవంతి ఉన్నట్లుగా తోచింది.

'ఎవరో మహారాజులు ఈ అడవిలో క్రీడాసౌధం కట్టించుకుని ఉంటారు' అనుకుంటూ ముందడుగు వేశాడు. ఆ భవంతి ఒక కొండ కొమ్ముపై ఉంది. ముళ్లు గుచ్చుకుంటున్నా లక్ష్యపెట్టకుండా కొండనెక్కాడు. చివరికి ద్వారం వద్దకు చేరుకోగలిగాడు.

'దైవం నన్ను రక్షించి, ఇక్కడికి చేర్చింది కానీ, లేకపోతే ఈ అడవిలో ఏమైపోయేవాడినో కదా!' అని తలపోస్తూ లోనికి వెళ్లాడు. భవంతి ప్రాంగణంలో అపూర్వమైన పూల సువాసనలు గుబాళిస్తున్నాయి. గోడలపై ఉంచిన మణిదీపకాంతులు పట్టపగటిని తలపిస్తున్నాయి.

తలుపులు తెరిచి ఉండటంతో లోనికి వెళ్లాడు. భూలోకంలో చూడలేని దివ్య వస్తువులెన్నో ఆ గదుల్లో ఉన్నాయి. వాటిని చూస్తూ ఆశ్చర్యపోతూ ఒక్కొక్క గదినీ దాటుకుంటూ వెళ్లాడు. ఒకగది తలుపులు చేరవేసి ఉన్నాయి. అతను ఆ గది తలుపులు తీయకుండా.. సందులలో నుంచి లోపలికి తొంగి చూశాడు.

అక్కడ శయ్యపై ఒక జంట ఉంది. వాళ్లిద్దరూ ఇలా మాట్లాడుకుంటున్నారు.

"నాథా! మీ వియోగంలో ఏడాదికాలం గడిచిపోయింది. నా ప్రాణానికి ఈ ఏడాది కొన్ని యుగాలైనట్లయింది. అయినా ఆ కుబేరునికి ఏం అపరాధం చేశామని మనల్నిలా శపించాడు?".

"ప్రియా! కుబేరుడు ఒక సౌర నారీమణిని వరించాడు. ఆమెను వెంటబెట్టుకుని రమ్మని నన్ను పురమాయించాడు. నేను ఇంటికి వచ్చి, నీ అధరామృతపానంలో పడి, ప్రభువు ఆజ్ఞ మరిచిపోయాను. దాంతో చిత్రకూట పర్వతంపై భార్యావియోగంతో ఏడాదిపాటు గడపమని నన్ను శపించాడు".

"పోనివ్వండి. చివరికి ఎలాగో ఆపద గట్టెక్కింది. సరే కానీ మనం ఇల్లూ వాకిలీ విడిచి ఎన్నాళ్లీ అడవిలో ఉండాలి?".

"నాకింక కుబేరుని సేవ చేయాలని లేదు. మనిద్దరం ఇటుపైన ఈ అడవిలోనే ఉందాం. నేను ప్రతిరోజూ వింతలు విశేషాలూ చూసివచ్చి నీకు చెబుతుంటాను. దాంతో హాయిగా మనకు కాలక్షేపం జరిగిపోతుంది. మనం సుఖించడానికి ఇదే తగిన నెలవు".

"మనోహరా! విశేషాలంటే జ్ఞాపకం వచ్చింది. ఇందాక వచ్చేటప్పుడు ఏదో మూటకట్టుకుని వచ్చారు.. ఏముంది అందులో?!".

"ఇదిగో.. ఇది కాళిదాస మహాకవి రచించిన మేఘసందేశం. ఇది మనిద్దరి కథే!".

"మన కథా.. అదేమిటి?!".

"అవును. కుబేరుని శాపం వల్ల నేను చిత్రకూట పర్వతంమీద ఉన్నప్పుడు నా విరహబాధను ఒక మేఘంతో చెప్పుకొన్నాను. ఆ మేఘాన్ని నీకు నా సందేశాన్ని వినిపించమని వేడుకున్నాను. మూడోకంటికి తెలియనివి, మనిద్దరికీ మాత్రమే తెలిసిన కొన్ని సంగతులను నీకు వినిపించి.. నమ్మకం కలగచేయమని చెప్పాను. నేనే మన ఇంటి గురుతులు చెప్పి, పంపించాను".

"నిజమే సుమండీ! నేను మీ సందేశాన్ని కూడా విన్నాను. కానీ, మన మధ్య జరిగిన సంగతులు ఆ కాళిదాసుకు ఎలా తెలిశాయి? అవన్నీ ఈ కావ్యంలో అతనెలా రాశాడు?! మీరు గానీ చెప్పారా?!".

"నేను చెప్పలేదు. కానీ, కాళిదాసు మహర్షి తుల్యుడు. త్రికాలవేది అని కిన్నరులు పాడుతుంటే ఎప్పుడూ వినలేదా?!. ఈ కావ్యాన్ని చదివితే నువ్వు కూడా ఆ మాట నమ్మగలవు".

"ఏదీ.. కొన్ని శ్లోకాలు వినిపించండి".

"ఇప్పుడు పొద్దుపోయింది. రేపు వినిపిస్తాను. ఏదీ.."